క్లుప్తంగా

నేడు సర్రాజు సంతాప సభ

ఉండి: క్షత్రియ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే పాతపాటి సర్రాజు సంతాప సభను నియోజకవర్గ స్థాయిలో ఉండి మండలం వాండ్రం గ్రామ పరిధిలో ఎన్నార్పీ అగ్రహారం గ్రామ సమీపంలోని కోట్ల ఫంక్షన్ హాల్లో నిర్వహిస్తున్నట్లు డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు సోదరుడు గోపాలకృష్ణ శుక్రవారం విలేకరులకు తెలిపారు. డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు ఆధ్వర్యంలో శనివారం మధ్యాహ్నం 2:30 గంటల నుండి నిర్వహించే ఈ సంతాప సభా కార్యక్రమంలో నాలుగు మండలాలకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు, సర్రాజు అభిమానులు పెద్ద ఎత్తున ఈ కార్యక్రమానికి హాజరుకావాలని కోరారు.

గ్రామాల్లో భూ సర్వే ప్రారంభం

పాలకోడేరు: మండలంలోని మోగల్లు, కోరుకొల్లు గ్రామాల్లో భూ సర్వే శుక్రవారం నుంచి ప్రారంభమైంది. అందులో భాగంగా తొలుత గ్రౌండ్ కంట్రోల్ పాయింట్స్ గుర్తించారు. దీని ప్రకారం డ్రోన్ సర్వే జరిగేటప్పుడు డ్రోన్ సరిగ్గా పాయింట్ దగ్గరే నిలుస్తుందని తహసీల్దార్ షేక్ హుస్సేన్ తెలిపారు. కొలతలు కచ్చితంగా ఉంటాయని స్పష్టం చేశారు. విలేజ్ సర్వేయర్లు కిషోర్, మనోజ్ పాల్గొన్నారు.

వీరవాసరంలో..

వీరవాసరం: జగనన్న భూ సర్వే హక్కు రక్ష పథకంలో భాగంగా శుక్రవారం రాయకుదురు, చింతలకోటి గరువు గ్రామాల్లో డ్రోన్ సర్వే కార్యక్రమాన్ని ప్రారంభించారు. రైతులంతా తమ హక్కు పత్రాలతో రెవిన్యూ అధికారులకు సర్వేయర్ సిబ్బందికి సహకరించాలని తహసీల్దార్ ఎం.సుందర్రావు తెలిపారు. నాని, అనిషా, వెంకట్రావు, ఇందిరా శైలజ, షరీఫ్ పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన



భీమవరంలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న కృష్ణారావు

సాక్షి, భీమవరం: విద్యార్థులకు జగనన్న గోరుముద్ద పథకంలో రుచికరమైన ఆహారం అందించాలని మధ్యాహ్న భోజన పథకం జిల్లా కో–ఆర్డినేటర్ కె.కృష్ణారావు అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఝాన్సీలక్ష్మీభాయి మునిసిపల్ పాఠశాల, నెహ్రూపేట ప్రాథమిక పాఠశాలల్లోని మధ్యాహ్న భోజన పథకం నిర్వహణను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కృష్ణారావు మాట్లాడుతూ విద్యార్థులకు రుచికరమైన ఆహారం అందించడంతోపాటు పాఠశాలలో మంచినీరు, మరుగుదొడ్లను పరిశుభ్రంగా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పీవీ శ్రీనివాస్, ఎస్.వెంకటపతిరాజు పాల్గొన్నారు.

బలహీన వర్గాలకు పదవులతో గౌరవం



మేడిది జాన్సన్

భీమవరం (ప్రకాశంచౌక్): కుల మతాలకు అతీతంగా బడుగు బలహీన వర్గాలకు ఉన్నత పదవులు కేటాయించి వారిని గౌరవించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కిందని ఆంధ్రప్రదేశ్ క్రిస్టియన్ మైనారిటీ సెల్ అధ్యక్షులు మేడిది జాన్సన్ అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఒక పక్క సంక్షేమ పథకాలతో బలహీన వర్గాలను ఆదుకుంటూ మరో పక్క వారిని రాజకీయంగా చైతన్యం చేస్తున్న జగన్‌మోహన్‌రెడ్డి బలహీన వర్గాల ఆశాజ్యోతిగా నిలుస్తున్నారన్నారు. 18 శాసన మండలి స్థానాల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీలకు కలిపి 14 మందికి అవకాశం ఇవ్వడం గర్వంగా ఉందన్నారు.

ఖాజీగా నియమితులైన ఫైజీకి సత్కారం



భీమవరం ముస్లిం జేఏసీ ఆధ్వర్యంలో ఫైజీని సత్కరిస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం: స్థానిక సున్నీ జామియా మసీదు గురువు (ఇమామ్) జనాబ్ మోయిజ్ ఆలం ఫైజీని భీమవరం డివిజన్ ప్రభుత్వ ఖాజీగా నియమించడం హర్షణీయమని ముస్లిం జేఏసి కన్వీనర్ జనాబ్ ముహమ్మద్ సిద్దీఖ్ అన్నారు. శుక్రవారం ముస్లిం జాయింట్ యాక్షన్ కమిటి ఆధ్వర్యంలో స్థానిక మసీదులో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జెఏసి సభ్యులు ఎమ్.ఎమ్. పాషా, సయ్యద్ ఫర్హాన్, ఖాజా, షేక్ ఫరీద్ బాబా, సోహైల్, అన్సారీ పాల్గొన్నారు.

13 నుంచి కుంభాభిషేక మహోత్సవాలు

భీమవరం (ప్రకాశంచౌక్): స్థానిక హౌసింగ్ బోర్డు కాలనీ శ్రీ పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో మార్చి 13 నుంచి శ్రీ శ్రీనివాస అద్భుత శాంతి మహాయాగపూర్వక శ్రీవారి అష్ట బంధన మహా సంప్రోక్షణ కుంభాభిషేక మహోత్సవం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా యాగశాల నిర్మించేందుకు ఆలయ అధ్యక్షుడు కంతేటి వెంకటరాజుతో ఆలయ అర్చకులు పాణింగిపల్లి శ్రీనివాసాచార్యులు పందిరిరాట ముహూర్తం చేయించారు. కార్యక్రమంలో కుక్కల బాల వెంకటరత్నం, తాడికొండ కోటేశ్వరరావు, జానపాటి మధు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో ఆదర్శం శ్రీరామపురం







మండలంలో శ్రీరామపురంలో సచివాలయం, విలేజ్ హెల్త్ క్లినిక్, రైతు భరోసా కేంద్రాలు

భీమవరం అర్బన్: ఆ గ్రామానికి ఆదాయం రాకున్నా అభివృద్ధిలో ఆదర్శంగా నిలిచింది. ఎవరో వస్తారు.. ఏదో చేస్తారని గ్రామస్తులు భావించలేదు. మండలంలోని శివారున ఉన్న శ్రీరామపురం గ్రామంలో ప్రభుత్వ అభివృద్ధి పనులకు గ్రామస్తులు సహకరించడంతో గ్రామంలో అభివృద్ధి పరుగులు పెడుతుంది. గతంలో చాలా గ్రామాలలో అభివృద్ధి పనులకు నిధులు మంజూరై గ్రామస్తులు సహకరించకపోవడంతో నిధులు వెనక్కి వెళ్లిపోయిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. మండలంలో 25 గ్రామ పంచాయతీలకు గానూ సచివాలయాలు, విలేజ్ హెల్త్ క్లినిక్‌లు, రైతు భరోసా కేంద్రాలు కొన్ని నిర్మాణ దశలో ఉండగా మరికొన్ని తుది దశకు చేరుకున్నాయి. అయితే మైనర్ పంచాయతీయైనప్పటికి రూ.కోటిపైగా నిధులతో సచివాలయం, విలేజ్ హెల్త్ క్లినిక్, ఆర్‌బీకే సెంటర్‌లు గ్రామస్తులకు అందుబాటులోకి రావడంతో ఆ గ్రామం మిగిలిన గ్రామాలకు ఆదర్శంగా నిలుస్తుంది. గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా అభివృద్ధికి నోచుకోలేదు. దీంతో 3వేల 500 జనాభా కలిగిన గ్రామంలో గ్రామస్తులు ఏదైనా దరఖాస్తు చేసుకోవాలన్నా, అధికారులను కలవాలన్నా గ్రామంలో అధికారులు ఉండేందుకు ఆఫీస్ భవనాలు లేకపోవడంతో పొరుగున వెంప, భీమవరంలోని మండల పరిషత్ కార్యాలయానికి కాళ్లరిగేలా తిరిగేవారు. ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అధికారం చేపట్టగానే గ్రామాభివృద్ధిలో భాగంగా శ్రీరామపురం గ్రామానికి రూ కోటిపైగా నిధులను మంజూరు చేశారు. గ్రామంలో భవిష్యత్ తరాలను దృష్టిలో పెట్టుకుని అందరికి అందుబాటులో ఉండేవిధంగా దాతల వద్ద నుంచి స్థలాన్ని సేకరించి గ్రామస్తులంగా ఏకతాటిపైకి వచ్చి సమన్వయంతో భవిష్యత్తు తరాలను దృష్టిలో ఉంచుకుని సచివాలయం, విలేజ్ హెల్త్ క్లినిక్, రైతు భరోసా కేంద్రాలను నిర్మించేందుకు గ్రామస్తులు సహాయ సహకారాలతో స్థల సేకరించామని భార్యభర్తలైన సర్పంచ్, ఉప సర్పంచ్‌లు కలిదిండి సుజాత, కలిదిండి శ్రీనివాసా ఫణీంద్రరాజులు చెబుతున్నారు. ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అధికారంలోకి రాగానే గ్రామంలో సీసీ రోడ్లు, పక్కా డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేయడంతో తమ గ్రామంలో ఎన్నో అభివృద్ధి పనులు జరిగాయని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సచివాలయంలో సేవలు భేష్

సచివాలయంలో కార్యదర్శి, డిజిటల్ అసిస్టెంట్, వెల్ఫేర్ అసిస్టెంట్, ఏఎన్ఎం, విలేజ్ సర్వేయర్, మహిళా పోలీస్, 6 గురు వలంటీర్లతో సేవలు భేష్ ఉన్నాయని గ్రామస్తులు చెబుతున్నారు. గ్రామస్తులు ఏ అవసరం ఉన్నా ఎక్కడవెళ్లకుండా గ్రామంలోనే తమ కార్యకలాపాలు పూర్తకావడంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు.

భవిష్యత్ తరాలను దృష్టిలో ఉంచుకునే..

భవిష్యత్తులో అందరికి అందుబాటులో ఉండేలా సచివాలయం, విలేజ్ హెల్త్‌క్లినిక్ సెంటర్, ఆర్‌బీకే సెంటర్‌లు ఒకే చోట ఉండేలా నిర్మాణం చేపట్టాం. గ్రామంలో ఏ సమస్యనైనా ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ దృష్టికి తీసుకువెళ్తే వెంటనే పరిష్కరిస్తున్నారు. ఆయన ఎమ్మెల్యేగా రావడం మండలంలో విసిరేసినట్టు ఉండే మాలాంటి గ్రామాల ప్రజల అదృష్టం.



– కలిదిండి సుజాత, సర్పంచ్

సామూహిక ఎలుకల నిర్మూలనతో అధిక దిగుబడులు



ఉండిలో సామూహిక ఎలుకల నిర్మూలనపై అవగాహన కల్పిస్తున్న ఏడీఏ శ్రీనివాస్, ఏఓ సంధ్య



వీరవాసరంలో సామూహిక ఎలుకల నిర్మూలన నిర్వహిస్తున్న దృశ్యం

ఉండి: రైతులంతా ఏకమై సామూహికంగా ఎలుకల నిర్మూలన చేపడితే అధిక దిగుబడులు సాధించవచ్చని ఆకివీడు వ్యవసాయ సహాయ సంచాలకుడు కేఏఎస్ఎస్ అన్నారు. మండల వ్యవసాయాధికారి బి.సంధ్య ఆధ్వర్యంలో శుక్రవారం ఉండిలో నిర్వహించిన సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమాన్ని ఏడీఏ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలుకల నిర్మూలన సామూహికంగా చేపడితేనే మంచి ఫలితాలు వస్తాయన్నారు. ఎక్కడైతే ఎలుకల సమస్య అధికంగా ఉంటుందో ఆ ప్రాంతాల్లో ముందుగా ఎలుకల రంధ్రాలను గుర్తించి వాటిని మట్టితో పూడ్చేయాలన్నారు. తర్వాత రోజు ఏ రంధ్రాలైతే తిరిగి తెరచుకుని ఉన్నాయో వాటిలో ఎలుకలున్నట్లు గుర్తించి వాటిలో ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల ద్వారా ఉచితంగా అందిస్తున్న బ్రోమోడయోలిన్ మందు 10 గ్రాముల చొప్పున కట్టిన పొట్లాలన వేసి మళ్లీ మూసివేయాలన్నారు. అందరూ ఈ విధంగా చేయడం వల్ల ఎక్కువ సంఖ్యలో ఎలుకలు చనిపోయే అవకాశం ఉందన్నారు. శనివారం నుంచి మండల వ్యాప్తంగా నిర్వహించే ఈ కార్యక్రమంలో రైతులంతా పాల్గొని రైతు భరోసా కేంద్రాల వద్ద అందజేసే బ్రోమోడయోలిన్ మందును తీసుకుని ఎలుకల నిర్మూలన చేపట్టాలని అన్నారు. కార్యక్రమంలో వీఏఏలు జె.ఆల్ఫ్రెడ్, పరంజ్యోతి, స్వప్న ప్రియ తదితరులు పాల్గొన్నారు.

వీరవాసరంలో..

వీరవాసరం: మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమం నిర్వహించారు. రైతులతో పొలం గట్ల మీద కన్నాలను మట్టితో పూడ్చివేయించారు. శనివారం ఆయా గ్రామాల్లోని ఆర్‌బీకేల వద్ద బ్రోమోడయలిన్ కలిపిన ఎరువును ఉచితంగా పంపిణీ చేస్తారని ఏఓ ఎస్.గీతాదేవి తెలిపారు. రైతులంతా సమష్టిగా కృషి చేసి సామూహిక ఎలుకల నిర్మూలను విజయవంతం చేయాలని కోరారు. మండలంలో సుమారు 12,256 ఎకరాల్లో దాళ్వా సాగు చేస్తున్నారని 98 శాతం పంట నమోదు చేసి 96 శాతం మంది రైతులకు ఈకేవైసీ చేయించామని తెలిపారు.

లింగ నిర్ధారణ పరీక్షలు నేరం

భీమవరం (ప్రకాశంచౌక్): లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం చట్ట రీత్యానేరమని డిస్ట్రిక్ట్ లెవెల్ అడ్వైజరీ కమిటీ చైర్మన్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ డి.మహేశ్వర రావు అన్నారు. భీమవరం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి వారి కార్యాలయంలో పీసీపీ పీఎన్ డీటీ యాక్ట్‌కు సంబంధించిన సబ్ డిస్ట్రిక్ట్ లెవెల్ మల్టీ మెంబర్ అప్రోపియేట్ అథారిటీ కమిటీ, సబ్ డిస్ట్రిక్ట్ లెవెల్ అడ్వైజరీ కమిటీ సమావేశం శుక్రవారం నిర్వహించారు. ప్రతి స్కానింగ్ సెంటర్ వద్ద గర్భస్థ పిండ లింగ నిర్ధారణ పరీక్షలకు సంబంధించిన బ్యానర్లు మూడు చోట్ల ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. కచ్చితంగా ఆసుపత్రి రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ స్కానింగ్ రూమ్‌లో ప్రదర్శించాలన్నారు. ప్రతి గర్భిణి స్కానింగ్ అయిన ఫామ్–ఎఫ్ రిపోర్టును ఆన్‌లైన్‌లో అప్లోడ్ చేయాలని సూచించారు. కొత్తగా అనుమతుల కోసం రెన్యువల్ కొరకు, మార్పులు చేర్పులు కోసం ఆన్‌లైన్‌లో మాత్రమే నమోదు చేసుకుని అనుమతి పొందాలన్నారు. ఆడపిల్లను పుట్టనిద్దాం–పెరగనిద్దాం అనే నినాదంతో ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఎక్కడైనా గర్భస్థ పిండా లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించినట్లు తెలిస్తే జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి వారికి, 102, 104 టోల్ ఫ్రీ నెంబర్లకు కాల్ చేసి చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు బి. భాను నాయక్, యూవీ రమణ రాజు, కె.ప్రవీణ్ కుమార్, బి.సుధాలక్ష్మి, జి.సుగుణ రాజు తదితరులు పాల్గొన్నారు.

బాలిక అదృశ్యం

ఆకివీడు: మండలంలోని చెలిమిల్లిపాడు గ్రామానికి చెందిన 17 ఏళ్ల బాలిక గురువారం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదని ఆమె తల్లి చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై రాజారెడ్డి శుక్రవారం చెప్పారు. ఆ బాలిక భీమవరంలోని ప్రైవేట్ కాలేజీలో ఇంటర్ ఫస్టియర్ చదువుతుందని పేర్కొన్నారు. బంధువుల ఇంటి వద్ద, చుట్టుపక్కల గ్రామాల్లో వెతికినా ఫలితం లేకపోవడంతో బాధితులు పోలీసులను ఆశ్రయించారు.

సాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు

వీరవాసరం: శివారు ప్రాంతాలకు సైతం సాగునీటిని అందించడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని ఇరిగేషన్ డీఈ శ్రీనివాస్ తెలిపారు. వీరవాసరం మండలం శివారు ప్రాంతాలను ఆయన శుక్రవారం పరిశీలించారు.నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట ఏఎంసీ చైర్మన్ కోటిపల్లి బాబు, ఏఈ సత్యనారాయణ, ఏఎంసీ డైరెక్టర్ మతల కాశి తదితరులు పాల్గొన్నారు.

హాస్టళ్ల తనిఖీ

సాక్షి, భీమవరం: ఉన్నత న్యాయస్థానాల ఆదేశాల మేరకు భీమవరం మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో 1వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎ.పవన్ కుమార్ స్థానిక 12 వార్డు లోని ఎస్సీ, బీసీ సంక్షేమ బాలికల వసతి గృహాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. బాలికలతో నేరుగా మాట్లాడి హాస్టల్ లో అందిస్తున్న ఆహార పదార్థాలు, విజిటింగ్ డాక్టర్, మంచినీరు, డ్రెయినేజీ, పరిసరాల శుభ్రత వంటి వాటిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎస్సీ హాస్టల్ వార్డెన్ భానుమణి, బీసీ హాస్టల్ వార్డెన్ కుసుమ కుమారి తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల అందజేత

వీరవాసరం: రామకృష్ణ మిషన్ ఇటీవల నిర్వహించిన పోటీల్లో వీరవాసరం ఎంఆర్‌కే జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారని హెచ్ఎం సీహెచ్ ప్రభామంజరి తెలిపారు. వీరవాసరం రామకృష్ణ మిషన్ 125 వ ఆవిర్భావ వార్షికోత్సవాల సందర్భంగా శ్రీరామకృష్ణ ప్రభ – విద్యార్థుల ప్రత్యేక సంచికపై పరీక్ష నిర్వహించి విజేతలైన విద్యార్థులకు శుక్రవారంబహుమతులు అందజేశారన్నారు. కార్యక్రమంలో శ్రీరామకృష్ణ సేవా సమితి సభ్యులు రంగరాజు, రాంబాబు, చిలుకూరి ఫణికుమార్ వివేకానందుడు, పంపన సాయిబాబు, వై.హేమలత పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్లో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం



భీమవరం కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

సాక్షి, భీమవరం: కేంద్రబడ్జెట్లో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేశారని సీపీఎం జిల్లా కార్యదర్శి బి బలరామ్ విమర్శించారు. కేంద్రబడ్జెట్‌ను నిరసిస్తూ శుక్రవారం భీమవరం కలెక్టరేట్ వద్ద సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల ప్రజలపై భారాలు వేసిన కేంద్ర బడ్జెట్‌ను తక్షణం సవరించాలని డిమాండ్ చేశారు. బడ్జెట్లో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరిగిందని ప్రత్యేక హోదా, రైల్వే జోన్ ప్రస్తావన లేకపోవడం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బి.వాసుదేవరావు, ఎం.వైకుంఠరావు, మామిడి శెట్టి రామాంజనేయులు, డి.నాగు, బి.వరలక్ష్మి, నాగమణి, కె.సాయమ్మ పాల్గొన్నారు.

సుకన్య పథకాన్ని వినియోగించుకోవాలి

భీమవరం (ప్రకాశంచౌక్): సుకన్య సమృద్ధి యోజన పథకాన్ని ఆడపిల్లల తల్లిదండ్రులు ఉపయోగించుకోవాలని భీమవరం పోస్టల్ సూపరింటెండెంట్ పి.బాలసుబ్రమణ్యం అన్నారు. శుక్రవారం స్థానిక పోస్టాఫీస్‌లో సంఘ సేవకుడు చెరుకువాడ రంగసాయి దాతల సహకారంతో రూ.11000 నగదుతో 44 సుకన్య అకౌంట్స్ ఓపెన్ చేయించి లబ్ధిదారులకు ఇచ్చారు. కార్యక్రమంలో హెడ్ పోస్ట్‌మాస్టర్ కె.ఆసిబాబు పోస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఫ్యామిలీ ఫిజీషియన్‌ను ప్రజలకు చేరువ చేయాలి



కొవ్వాడ అన్నవరం గ్రామంలో డ్రైడే ప్రాముఖ్యతపై ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

భీమవరం అర్బన్: ఫ్యామిలీ ఫిజీషియన్ (ఫ్యామిలీ డాక్టర్) కార్యక్రమాన్ని ప్రజలకు చేరువ చేయాలని డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ మహేశ్వరరావు ఆదేశించారు. భీమవరం మండలంలోని కొవ్వాడ అన్నవరం గ్రామంలో హెల్త్ సెంటర్‌ను శుక్రవారం డీఎంహెచ్‌వో డాక్టర్ మహేశ్వరరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో డాక్టర్ మహేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా గ్రామస్తులకు వైద్యాన్ని ఉచితంగా అందించాలనే ఉద్దేశంతో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తుందన్నారు. వైద్యులు, ఆరోగ్య సిబ్బంది క్షేత్ర స్థాయిలో గ్రామస్తులకు ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. అనంతరం గ్రామంలో డ్రై డే నిర్వహించడం వల్ల కలిగే ఉపయోగాలు గురించి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో సత్యనారాయణ, హెచ్‌వీ చండీరాణి, హెచ్ఎస్ శంకర్, హెచ్‌పీ ప్రమీల, ఏఎన్ఎంలు ఏచర్ల రాణి, చిలకమ్మ, తదితరులు పాల్గొన్నారు.

రేపు మెంటేవారితోటలో వైద్య శిబిరం

భీమవరం (ప్రకాశంచౌక్): పట్టణంలోని మెంటే వారి తోటలోని సుందరయ్య భవనంలో ఆదివారం ఉదయం 9 గంటల నుంచి పక్షవాతం, ఫిట్స్ బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు వైద్య శిబిరం నిర్వహిస్తున్నామని అల్లూరి సీతారామరాజు భగత్ సింగ్ సేవా విజ్ఞాన కేంద్రం కన్వీనర్ రాధాకృష్ణ, వసుధ ఫౌండేషన్ కన్వీనర్ ఇందుకూరి ప్రసాదరాజు శుక్రవారం విలేకరులకు తెలిపారు. విజయవాడకు చెందిన డాక్టర్ గోపాలం శివన్నారాయణ క్యాంపులో వైద్యులు డాక్టర్ డి.సందీప్ వర్మ తదితరులు పాల్గొని వైద్య సేవలు అందిస్తారని పేర్కొన్నారు.

ఆలయాల్లో సబ్ కలెక్టర్ పూజలు

భీమవరం (ప్రకాశంచౌక్): శ్రీమావుళ్లమ్మ అమ్మవారిని శుక్రవారం నరసాపురం సబ్ కలెక్టర్, పశ్చిమగోదావరి జిల్లా ఇన్‌చార్జ్ జాయింట్ కలెక్టర్ ఎం.సూర్యతేజ కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. కలెక్టర్ దంపతులకు ఆలయ ప్రధాన అర్చకులు మద్దిరాల మల్లికార్జునశర్మ వేదాఆశీర్వచనం అందించారు. ఈ కార్యక్రమంలో ఈఓ యర్రంశెట్టి భద్రాజీ, ధర్మకర్తలు రామాయణం సత్యనారాయణ, ముత్యాల వెంకట రామారావు పాల్గొన్నారు. అనంతరం సబ్ కలెక్టర్ దంపతులు పంచారామక్షేత్రం గునుపూడి శ్రీ ఉమా సోమేశ్వరస్వామిని దర్శించుకుని పూజలు చేశారు. కార్యక్రమంలో ఈఓ ఎం. అరుణ్ కుమార్, ధర్మకర్తలు పాల్గొన్నారు.

డ్రాపౌట్స్‌పై ప్రత్యేక దృష్టి సారించాలి

భీమవరం (ప్రకాశంచౌక్): చదువు మానేసి బడి బయట ఉన్న పిల్లలపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి సంబంధిత అధికారులను ఆదేశించారు. భీమవరంలోని కలెక్టరేట్ జిల్లా కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి డ్రాప్ అవుట్లపై సంబంధిత అధికారులతో శుక్రవారం సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ జిల్లాలో 473 మంది పిల్లలు బడి బయట ఉన్నారని, వీరందరిని పాఠశాలలో చేర్చేందుకు చర్యలను వేగవంతం చేయాలన్నారు. అనారోగ్య కారణాలు, మైగ్రేషన్, బాల్య వివాహాలు తదితరాలు డ్రాప్స్ ఔట్స్‌కు కారణంగా ఉన్నాయన్నారు. బాల్య వివాహాలు చేసుకున్న ఆడపిల్లలను పట్టణ వసతి గృహాల్లో చేర్పించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అనారోగ్య కారణాలు చూపుతున్న వారి వివరాలను ఫొటోతో సహా సేకరించి ఉంచాలన్నారు. చదువుకునే వయసులో ఉన్న పిల్లలు ఎట్టి పరిస్థితుల్లో బడి బయట ఉండడానికి వీలులేదని కలెక్టర్ తెలిపారు. సమావేశంలో డీఈఓ ఎ.వెంకటరమణ, సమగ్ర శిక్ష ఏపీసీ పి.శ్యాంసుందర్, ఏఎల్ఎస్ కోఆర్డినేటర్ జీఏజే దీవెనమ్మ, జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారి సుజాత రాణి, భీమవరం డీఎల్‌డీఓ కె.కృష్ణ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికట్టడంపై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ జి.స్వాతి

కాళ్ల: బాల్య వివాహాల చేయడం నేరమని, వాటిని ప్రోత్సహించిన వారిపై చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ స్వాతి హెచ్చరించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బాల్య వివాహాలను అరికట్టడంపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఆమె మాట్లాడుతూ చిన్న వయసులో వివాహాలు చేయడం వల్ల శిశు మరణాలు ఎక్కువగా జరుగుతాయని తెలిపారు. దీనివల్ల సమాజాభివృద్ధి కుంటు పడుతుందని స్పష్టం చేశారు. బాల్య వివాహాల చట్టం 2006 ను అతిక్రమిస్తే రహస్యంగా పెళ్లి చేయాలని చూసినా వధువు, వరుడు కుటుంబ సభ్యులపై, ప్రోత్సహించిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. అంతేకాకుండా ఫోక్సో చట్టం కింద కేసులు నమోదు చేస్తారన్నారు. సమావేశంలో తహసీల్దార్ కృష్ణారావు, ప్రభాకర్, ఏఎస్ఐ సీతారామరాజు, అంగన్‌వాడీ సూపర్వైజర్ సూర్య కుమారి పాల్గొన్నారు.